రైతు బజారులో న్యూ ఇయర్ వేడుకలు



న్యూ ఇయర్ వేడుకల్లో రైతులు

విశాఖ విద్య: మర్రిపాలెం రైతు బజార్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రైతులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళా రైతులు ప్రాంగణంలో రంగు రంగుల ముగ్గులు వేశారు. కొత్త సంవత్సరంలో రైతులు మరింత అభివృద్ధి చెందేలా వ్యాపారం సాగాలని ఈవో వరహాలు ఆకాంక్షించారు.

ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే జాబ్‌మేళా నిర్వహించామన్నారు. పలు కంపెనీలతో మాట్లాడి అన్ని వర్గాల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీ ప్రాంత అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు ఆదివారం నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉన్నత చదువులు చదువుకున్నా తమలో చాలా మంది ఉపాధికి ఉపాధి అవకాశాలు లేవని వివరించారు. దీనికి ఆనంద్ కుమార్ స్పందిస్తూ యువతకు ఎంఎస్ఎంఈల ద్వారా పలు రంగాలకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఉపాధి శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో చాలా మందికి ఉపాధి అవకాశం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, సేవా సంఘం ప్రతినిధులు,సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం



ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 8,9,10 తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఆసక్తి గల మహిళలు ఈ నెల 5వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆనంద్‌కుమార్ కోరారు. కమిటీలను సంప్రదించవచ్చునన్నారు.

వార్డు స్థాయిలో అందించే బహుమతులను ఆయన ప్రకటించారు.

వార్డు పరిధిలో.. ప్రథమ బహుమతి (స్మార్ట్ మిక్సర్ గ్రైండర్), రెండో బహుమతి (హై క్వాలిటీ డిన్నర్ సెట్), మూడో బహుమతి (రాగి వాటర్ కంటైనర్),నాలుగో బహుమతి (నాన్ స్టిక్ సెట్),ఐదో బహుమతి (కుక్కర్) అందించనున్నారు. వార్డు స్థాయి విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. ఇందులో మొదటి విజేతకు (డబల్ డోర్ ఫ్రిజ్), రెండో బహుమతి (ఆటోమేటిక్ టాప్ లోడ్ వాషింగ్ మిషన్), మూడో బహుమతి (హెచ్‌డీ స్మార్ట్ ఎల్ఈడీటీవీ, నాలుగో బహుమతి (మైక్రో ఓవెన్), ఐదో బహుమతి (టేబుల్ టాప్ వెట్ గ్రైండర్) అందించనున్నారు.

బలరామ్‌కు ఘన సత్కారం



బలరామ్‌ను సత్కరిస్తున్న షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: షిప్‌యార్డ్‌లో విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందిన బలరామ్‌ను హిందూస్థాన్ షిప్‌యార్డ్ యాదవ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. స్థానిక యాదవ సంఘం వద్ద జరిగిన కార్యక్రమంలో ఉరుకూటి మురళీధర్,జోగ రాజు, వి.సింహాచలం ,నీలాతి వంశీ,చిరంజీవి,నర్సింగరావు తదితరులు ఆయనకు శాలువా కప్పి సత్కరించారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ లీగ్



కిషోర్ యాదవ్‌కు మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న విశాఖ వెస్ట్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. ఆదివారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. రాజారత్న క్రికెట్ క్లబ్.. ఇండియన్ లయన్స్ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌ను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించారు. టాస్ గెలిచిన రాజారత్న క్రికెట్ క్లబ్ జట్టు బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేశారు. ఛేజింగ్ చేసిన ఇండియన్ లయన్స్ 6.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 89 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. ఇండియన్ లయన్స్ బ్యాటర్ కిషోర్ యాదవ్ 26 బంతుల్లో 69 పరుగులు చేసిన మ్యాన్‌ఆఫ్ దా మ్యాచ్ సాధించాడు. ఆయనకు బెహరా భాస్కరరావు అవార్డును అందించారు.

● రెండో మ్యాచ్ లిమిట్‌లెస్ గ్లాడియేటర్స్ వర్సెస్ కరాసా రాక్ స్టార్స్ మధ్య హోరీ హోరా జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లిమిట్‌లెస్ గ్లాడియేటర్స్ నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసింది. ఛేజింగ్‌లో దిగిన కరాసా రాక్ స్టార్స్ 4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 71 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించింది. మ్యాన్ ఆఫ్‌దా మ్యాచ్ వంశీ సాధించాడు.

మళ్ల ధనలతకు అభినందన



ధనలతకు జ్ఞాపిక అందిస్తున్న ఈవో శిరీష

మల్కాపురం: కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు మళ్ల ధనలతను కనక మహాలక్ష్మి దేవస్థానం ఈవో శిరీష, ఇంజినీర్ సీహెచ్.రమణ జ్ఞాపిక ఇచ్చి అభినందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మ ప్రచార మాసోత్సవాల్లో ధనలత దేవీ అవతారంలో నృత్య ప్రదర్శన చేసి ప్రతిభ చూపింది. అందుకు గానూ ఆదివారం ఆమెకు జ్ఞాపిక అందజేసి అభినందించారు.

శ్రీకృష్ణుడిగా అప్పన్న



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదోరోజు ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శ్రీకృష్ణుడి అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకీలో .. ఆళ్వారులను మరో పల్లకీలో అదిష్టింపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బెహరా భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వలంటీర్లు

గోపాలపట్నం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు పని చేయాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అన్నారు. జీవీఎంసీ 91, 92 వార్డుల పరిధిలో కొత్తగా నియమితులైన వలంటీర్లు ఆదివారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ఆట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలని, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని సచివాలయం పరిధిలో పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వివక్ష, పక్షపాతం లేకుండా పని చేయాలన్నారు. వలంటీర్లు వై. నీరజ, డి. సాయి హేమలత, టి. తేజేశ్వరి, కోట నిర్మల, శాంతి, చుక్క రవితేజ తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో సిరులతల్లి



దర్శనానికి వేచి ఉన్న భక్తులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 18వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంట ల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ, క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం ఆదివారం మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల ను ఆకట్టుకున్నా యి. ఆలయ ఈవో కె.శిరీష, ఏఈఈవో కె. తిరుమలేశ్వర రావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిను కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు.

● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.